# రాక్షసమహాసభలు!

ఈపవిత్ర భారతావనిలో ఎన్నెన్ని మతాలు... జాతులు... కులాలు... వున్నాయో అన్నెన్ని రాజకాయ పార్టీలూ వుండటంలో తప్పులేదు. ఎవరెవరి సిద్ధాంతాలు వారివి! పోనీ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి వుంటారా అంటే అదీ లేదు. ఒకపార్టీలోంచి మరో (పాతో/కొత్తో) పార్టీలోకి జంపులు సాధారణం! అందుక్కారణాలు అనేకం! పార్టీలో పదవి రాలేదనో... లాభపడలేదనో.. తమకు విలువ లెకుండా పోయిందనో... ఇలా ఏదైనా కావచ్చు!

రోజుకో రాజకీయ పార్టీపుట్టుకొస్తూనే వుంది. ఇదిమిద్ధంగ చూస్తే ఏపార్టీకైనా ఎన్నికల్లో పూర్తి మెజారిటీ వచ్చి ప్రభుత్వాలను ఏర్పాటు చేయలేక పోతున్నందుకే... ఇతరులతో (పార్టీలతో) పదవులిస్తామనో... మూటలిస్తామనో దువ్వి తమవైపు అకర్షించుకుని లేదూ తిప్పుకుని వూరగాయల్లో 'మిక్సడు పికిల్' లాగ కలగాపులగంగా ఏర్పడి ప్రభుత్వాన్ని నడపుతూ వుండటం అందరూ ఎరిగిన వాస్తవమే!

ఎవరూ నీతి మంతులు కారు! పార్టీ సిద్ధాంతాలను అతిక్రమించి... తుంగలో తొక్కి ఎవరెవరి స్వార్థం వారు చూచుకోవటంలో సిద్ధహస్తులు!

ఈనేపథ్యంలో ఇటీవలే ఒక రాజకీయ పార్టీ జాతీయస్థాయిలో పురుడు పోసుకుంది!

ఆ రాజకీయ పార్టీ పేరు అర్(రాక్షస) అర్ (రాజకీయ) పి(పార్టీ). ఈ కొత్త రాజకీయ పార్టీ మ్యానిఫెస్టో దేశవ్యాప్తంగా విడుదల చేయటం జరిగింది.

ఈ అర్అర్పి కొత్త పార్టీ అన్ని రాష్ట్రాల్లోనూ వేళ్లూనుంది. కార్యకర్తలు వెలిసారు. పార్టీ జండా ఎలా వుండాలో వినూత్నంగా డిజైన్ చేయబడింది.

అర్అర్పి పార్టీ రానున్న జనరల్ ఎలక్షన్స్‌లో అన్ని రాష్ట్రాల్లోనూ తమ అభ్యర్థులను నిలబెట్టాలనీ తమ పార్టీ పదవిలోకి రావాలనే ఆరాటంతో పార్టీని బలోపేతం చేయటానికి అన్ని లెవల్స్‌లోని నాయకులు అహర్నిశం శ్రమించటం విశేషం!

అన్ని పార్టీలోనూ రాజకీయ రగడ... అసంతృప్తి సెగలు వుంటునే వుంటయ్. పార్టీ వీడిపోతామని బెదిరించే వారిని దువ్వటం కులాల పేరుతో జరగటం కద్దు!

భారతదేశంలో కులాభిమానాలకే పెద్దపీట! ఒక కులంవారు మరొక కులంవారిని బాహాటంగ... బహిరంగంగా దూషించుకున్నా... వారి మధ్యమైత్రి మాత్రం చెడదు. అపోజిషన్ పార్టీ వారుసైతం రూలింగ్ పార్టీతో సహకరిస్తూ... భుజాలమీద చేతులేసుకుని డిన్నర్లిచ్చిపుచ్చుకోవటం ఆనవాయితీ!

ఎవరు ఏపార్టీవారైనా మనసులో మాలిన్యం... కక్ష వున్నా... పైకి లేనట్టే నవ్వులొలికించటం... కరచలనాలు.. కౌగిలింతు మామూలే! అందుకే వారిదంతా ఒకే కులం అదే... రాజకీయ కులం అనే భావనవ్యక్త పరుస్తూంటారు.

రాజకీయ నాయకులలో టార్చి వేసి వెతికినా సత్యహరిశ్చంద్రులు... దర్మరాజులు కానరారు. కన్పించే వారంతా దుర్యోధన.. దుశ్శాసన సంతతి వారే కాక రాక్షసజాతి వాళ్లూ అనేకులు!

లోగడలాగ గాంధీ నెహ్రూ వల్లభాయ్ పటేల్ వంటి మహనీయులు... తమయావత్ జీవితాన్ని జాతి వుద్ధరణకు... ప్రయోజనాలకు... అభివృద్ధికి పాటుపడేవారు నేడు రాజకీయాల్లో కానరాదు!

నేడు నేతల్లో స్వార్ధచింతన... కులాభిమానం... అవినీతి... చెప్పేవి చేయకపోవటం... వాగ్దానాలను గాలికి వదిలేయటం... తమవారికి కొమ్ముకాయటం ఓటేసి గెలిపించిన వారిబాగోగులు పట్టించుకోక పోవటమే రాజనీతిగా మారింది.

ఆర్.ఆర్.పి మహాసభలు విశాఖలో నిర్వహించాలని కేంద్ర కమిటీ నిర్ణయం తీసుకుంది. ఆం.ప్ర.లో అయితే తమ పార్టీ కేడర్ బలంగా వుందనే విశ్వాసం వున్నందునే కార్యకర్తలు సభల నిర్వహణ విషయంలో అలసత్వం లేకుండా శ్రమిస్తారనేది ముఖ్యోద్దేశం.

పత్రికల వారికి... టి.వీల వారికి ఆహ్వానాలు అందాయి. విదేశీ ప్రతినిధులు కూడా అనేకులు రానున్నందున వారికి ప్రత్యేక వసతి భోజన ఏర్పాట్లు చేశారు.

తాము నిర్వహిస్తున్న సభలకు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్ల కోసం పోలీసు వారి సాయమూ కోరారు అరడజను ప్లాటూన్ల పోలీసులు.. అయిదొందల మంది దాకా వివిద స్థాయిల్లో ఉన్న పోలీసు అధికారులూ విశాఖలోకొచ్చి వాలారు.

వంటవార్పు... కాఫీ టిఫిన్ల తయారీకి ప్రత్యేకంగ సభలు జరిగే పెండాల్స్ పక్కనే షామియనాలు ఏర్పాటు చేసి గాడిపొయ్యిలు తవ్వించి... ఓవంద గ్యాస్

స్టౌలు.. గ్యాసు సిలిండర్లు... బస్తాల కొద్దీ ఖరీదైన బియ్యం... చుట్టు పక్కల గ్రామాల నుండి తమకు సరిపడా కూరగాయలు... రాజమహేంద్రి నుంచి జగజట్టీల్లాంటి వంటివారిని రప్పించటమూ జరిగింది.

సిటీనిండా ఎటు చూచినా పార్టీ కటౌట్లు... జండాల సమూహంతో చూపరులకు కనువిందు చేస్తున్నయ్.

అసంఖ్యాకంగా ఇతర రాష్ట్రాలు... ప్రదేశాలనుంచి వచ్చే పార్టీ సభ్యులతో సిటీ కిటకిటలాడుతోంది. మంచినీటికి కటకట ఏర్పడింది. హోటళ్లు బార్లు క్రిక్కిరిసివుంటున్నయ్!

హింసించటం... చిత్రవధకు గురిచేయటం... హత్య... శాడిజం... అనేకానేక విధాలుగా గాయపరచటం... దొంగతనం... దోపిడీలు... ప్రభుతకు పన్నులగవేత... అక్రమవ్యాపారం... అవినీతి... నల్లధనం... ఫేక్ కరెన్సీ చలామణీ... డూప్లికేట్ ఆస్పత్రులు... మందుల వుత్పత్తులు... మాదక ద్రవ్యాలు... ధూమపానం... మద్యపానం.... కులాభిమానం ఎన్‌కౌంటర్స్... బ్రూణహత్యలు... కిడ్నాపులు... అరాచక శక్తులు... మానభంగాలు... బార్‌లు... క్లబ్బులు పబ్బులు... హుక్కా సెంటర్స్... మగవారిలో రాక్షస ప్రవృత్తి... వగైర్లాలాంటి ముఖ్యాంశాలపై విస్తృత చర్యలు... నివారణోపాయాలు... పాలకుల అసవర్ధత... అధికార యంత్రాంగం నిర్లక్ష్య ధోరణి... అలసత్వం నిర్మూలనకై మార్గాన్వేషణ మొదలైనవి. ఆర్.అర్.పి ముఖ్యాంశాలు! అందుకోసమే ఈ మహాసభల నిర్వహణ! నివారణోపాయాల కొరకై అన్వేషణ!

అవసరానుగుణం రాజ్యాంగ సవరణ! రక్షణ వ్యవస్థ పటిష్ఠత.. రాజకీయ జ్యోషం ఎరంగంలోనూ లేకుండుట... ప్రజలను శాస్త్రీయంగ విద్యావంతులను చేయటం... జ్ఞాన సముపార్జన విధానాన్ని ప్రతి భారతీయునకు కల్పించుట ఏమతం వారైనా... జాతి వారైనా... భారతీయులే! ఎవ్వరికీ ప్రత్యేకించి వారి వారి జాతికి ప్రత్యేక మార్గాలు లేకుండా చేయుట! అందరూ సమానమేననే విధానాన్ని బలపరచుట!- పేదబలహీన బడుగు వర్గాలకు ప్రగతి ఫలాలు అందేలా మనసా వాచా కర్మణ చర్యలు చేపట్టుట!-

ఇవీ స్థూలంగ ఆర్.ఆర్.పి. మేనిఫెస్టోలో గల ఐటమ్స్!

మేనిఫెస్టోలోని అంశాలకు యావత్ భారతదేశ ప్రజలు ముగ్ధులైనారు.

కేవలం ఆర్.ఆర్.పి పార్టీ వారే కాకుండా ఐ.ఎ.ఎస్... ఐ.పి.యస్... డాక్లర్లు... లాయర్లు... విశ్వవిద్యాలయాల కులపతులు... సైంటిస్టులు.. వ్యాపారవేత్తలు... మహిళలు... విద్యార్ధులు మరెందరో మహానీయులు... సభలకు తరలిరావటం చూచి కొత్త రాజకీయపార్టీ నేతలకు ముచ్చటేసింది. దేశ ప్రజలు నూతనత్వాన్ని కోరుకుంటున్నారనే విషయం బోధపడింది.

సభాప్రాంగణంలో దిగ్భ్రాంతి చెందేరీతిలో క్రమశిక్షణ పాటించటం చూస్తూ సభికులు విస్తుపోయి ముక్కున వేలేసుకున్నారు.

తోపులాటలు... కీచులాటలు... తన్నులాటలు కుర్చీలు విసురు కోవటాలు... విరగ్గొట్టటాలు... గొంతు చించుకు అరవటం... పరస్పర నిందారోపణలు... లాఠీ ఛార్జ్ వంటివేవీ జరక్కపోవటం విశేషం!

మొదటిరోజు సభలో... అరవై సంవత్సరాలపై బడిన వారికి తమపార్టీలో స్థానం కల్పించబోమంటూ తీసుకున్న పార్టీ నిర్ణయాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇతర పార్టీల నుండి వలస వచ్చేవారికి ఆర్.ఆర్.పీలో చోటుండదని... నేర చరితలకు... పన్ను ఎగవేత దారులకు... నల్లధనం కలవారిక్కూడ తమ పార్టీలో చేర్చుకోమంటూ తీర్మానం చేశారు.

రెండవరోజు మహాసభలో... ఎన్నికలప్పుడు పార్టీ ఫండు నుంచిగాని... విరాళాల రూపంలో గాని ధనాన్ని సభ్యులు సేకరించటం నిషిద్ధమని... ఓటర్లను ధన... వస్తురూపంలో ప్రలోభపెట్టటం జరగదని... అందుకు తమ పార్టీ నియమావళికి విరుద్ధమని... వృద్ధాప్య పించన్ విధానం దేశం మొత్తానికి ఒకే విధంగ అమలుపరుస్తామంటూ వేదికపైన గల నేతలు వాగ్దానం చేశారు.

ఆఖరి రోజు మహాసభలో... ఏ ప్రభుత్వ ప్రైవేటు యాజమాన్యాలపై న్యాయస్థానాలపై పార్టీ ఒత్తిడి వుండదని... స్వయం ప్రతిపత్తితో శాఖలు... శాఖాధిపతులు వ్యవహరిస్తారని పార్టీ ప్రతినిధుల ప్రమేయం కాని.. జోక్యం గాని నిషిద్ధమని నేతలు నొక్కివక్కాణించారు.

ఇకపై దేశంలో బడుగు బలహీన వర్గాలను వారు వుండబోరని అందరికీ ఉచిత విద్య... వైద్యం... ఉపాధికల్పన వుంటుందనీ కులాల ప్రాతిపదికపై కాకుండా ఆర్థికంగ సమానత్వం కల్పిస్తామని... రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనే దాన్ని పక్కన

పెడతామని వేదికపై వున్న పార్టీ నేతలు ప్రజలపై ప్రమాణం చేశారు.

తప్పులు చేసిన వారిని ఉపేక్షించటం జరగదని... న్యాయ స్థానాలకు సంపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్రాలు వుండగలవని ప్రతిన పూనారు. న్యాయదేవత కళ్లకు ఇంతవరకు ఉన్నగంతలు ఇకపై వుండవని... హర్షాతి రేకాల మధ్య పార్టీ దిగ్గజాలు ప్రకటించారు.

మనుషుల్లో రాక్షస ప్రవృత్తిని సమూలంగా రూపుమాపాలనే సదుద్దేశ్యంతోనే పార్టీకి 'రాక్షస రాజకీయ పార్టీ' అని నామకరణం చేయటం జరిగిందంటూ అహూతులకు వివరించారు.

రాక్షస సంహారానికి పార్టీ కట్టుబడి వుంటుందని ఇకపై దేశంలో అందరూ మహాత్ములే వుంటారని తమది రామరాజ్య పాలనౌతుందని... తమ కొత్త రాజకీయ పార్టీని రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించి అన్ని రాష్ట్రాల్లోను... కేంద్రంలోనూ తమకే పాలనాధికారం కట్టబెట్టాలని ప్రతి ఓటరు విజ్ఞతలో ఆలోచించి తమను అఖండ మెజారితో గెలిపించవలసినది అభ్యర్థించటం జరిగింది.

ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలూ సభలు నిర్వహించినన్ని రోజులూ జరక్కపోవటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

(సమాప్తం)